క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: రామచంద్రపురం మండల 33/11 కేవీ, ఆర్‌సీపీ టౌన్ సబ్‌స్టేషన్ 11 కేవీ టౌన్ 2ఫీడర్, టౌన్ వన్ ఫీడర్ మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విజయనంద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఒక గంట నుంచి సాయంత్రం ఐదు వరకు పట్టణంలోని మెయిన్ రోడ్డు, రత్నంపేట, గుబ్బలవారిపేట, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి, లలితానగర్, వీఎస్‌ఎం కాలేజి, ఏరియా ఆస్పత్రి, మోడరన్ కళాశాల, రామకృష్ణ సెంటర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, చైతన్య రైస్ మిల్లు, గాంధీ ఆస్పత్రి, కమ్మవారి సావరం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఉండదని వివరించారు.

సైన్స్‌ఫేర్ నిర్వహణపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణమూర్తి

రాయవరం: మండల స్థాయిలో ఈ నెల 19న నిర్వహించే సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలని ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ కోరారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సులో భాగంగా ఈ నెల 19న మండల స్థాయిలో నిర్వహించాలని, అంతకు ముందుగా పాఠశాల స్థాయిలో కూడా సైన్స్ ఫేర్ నిర్వహించాలన్నారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను ప్రతిబింబించేలా నమూనా ప్రాజెక్టులు రూపకల్పన చేయాలన్నారు. విద్యార్థి వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయులు వారి వారి విభాగాల్లో ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించాలన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బులి వెంకటరెడ్డి తదితరులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేశారు.ఆ గ్రామంలోని డొక్కా సీతమ్మ అన్నదాన ట్రస్ట్ ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వృద్ధులకు, దివ్యాంగులకు భోజనంతో పాటుగా దుప్పట్లు, రొట్టెలు వారి ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ తాడి బులి వెంకటరెడ్డి అన్నదాన ట్రస్టును ప్రారంభించి, రెండేళ్లుగా అన్నదానం చేపడుతున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల శాఖ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరాశాజనకంగా దిగుబడులు

కాజులూరు: తుపాను నేపథ్యంలో వరి దిగుబడులు నిరాశాజనకంగా ఉన్నాయని కాకినాడ ప్రణాళిక కార్యాలయం గణాంకాధికారిణి కె.శ్యామల తెలిపారు. కాజులూరు మండలంలోని మంజేరు శీల గ్రామాల్లో సోమవారం వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపానుకు ముందు పంట కోత ప్రయోగం చేయగా, మంజేరు, శీల గ్రామాల్లో సుమారుగా 32 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడులు వచ్చాయన్నారు. తుపాను అనంతరం పంట కోత ప్రయోగం చేయగా, మంజేరులో 15 బస్తాలు, శీలలో 4 బస్తాలు దిగుబడి వచ్చినట్టు తెలిపారు. ఈ పంట కోత ప్రయోగంలో సహాయ సచివాలయ గణాంకాధికారి ఎం.సత్యనారాయణ, శీల సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకుడు మామిడిశెట్టి రామకృష్ణ, స్థానిక రైతులు వరదా వెంకటేశ్వరరావు, పడాల సత్తిబాబు, యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

వేగాయమ్మపేటలో ఐక్య క్రిస్మస్ వేడుకలు



వేగాయమ్మపేటలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: వేగాయమ్మపేటలో సోమవారం ద్రాక్షారామ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని ముఖ్య అతిథిగా పాల్గొని, కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రేమ, శాంతి సందేశాలను జీసస్ ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, నెహ్రూ దంపతులు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ పీఎస్ జేసుపాదం, జిల్లా గౌరవాధ్యక్షుడు జి.విజయరాజు, వి.సురేష్‌కుమార్, రాక్ చర్చి పాస్టర్ కనికెళ్ల ఆనందకుమార్, పాస్టర్లు నక్కా సతీష్, పోతు చిన్నారావు, జి.సత్యానందం, క్రైస్తవులు పాల్గొన్నారు.

రబీకి అన్నదాత సన్నద్ధం

- చివరిలో మిచాంగ్ అలజడి
- అది మినహా మిగిలిన ఖరీఫ్ ప్రక్రియ సానుకూలం
- రబీ సాగుపై ముందస్తు ప్రణాళిక
- ప్రారంభమైన దమ్ములు
- రెండు నియోజకవర్గాల్లో 1,01,732 ఎకరాల్లో వరి సాగు



కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో రబీ దమ్ము చేస్తున్న రైతు

కపిలేశ్వరపురం: రబీ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావాన్ని మినహాయిస్తే, ఖరీఫ్ సాగులో వచ్చిన దిగుబడి, సాగునీరు లభ్యత, ధాన్యం కొనుగోళ్లు సులభతరం కావడం వంటి అన్ని అంశాల్లో రైతుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిచాంగ్ విలాపం నుంచి కోలుకుని రబీకి సన్నద్ధం అవుతూ దమ్ములు చేస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

క్లస్టర్ పరిధిలో మండలాల వారీగా రామచంద్రపురంలో 18,806, కె.గంగవరంలో 15,633, కాజులూరులో 19,382, మండపేటలో 16,985, రాయవరంలో 14,593, కపిలేశ్వరపురంలో 16,333 ఎకరాల్లో, మొత్తం ఆరు మండలాల్లో 1,01,732 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగవుతుంది.

అలజడిని నుంచి కోలుకుని..

మిచాంగ్ తుపాన్ అలజడి నుంచి కోలుకుని రైతులు రబీ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. అల్పపీడనం ఏర్పడనుందంటూ ప్రభుత్వం ముందుగానే అప్రమత్తం చేయడంతో అవకాశం ఉన్న మేరకు పంటల మాసూళ్లు చేసుకున్నారు. మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 95 శాతం పంట తుపానుకు ముందే కోయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అందులో కొంతభాగం వ్యవసాయ క్షేత్రాల్లో ఉండిపోవడంతో నష్టపోయారు. రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ నుంచి ఆర్బీకేలోని వ్యవసాయ సహాయకుల వరకూ అధికార యంత్రాంగమంతా వెన్నంటి నడవడంతో పంటను రక్షించుకునే వీలు రైతుకు కలిగింది. ఆఫ్ లైన్‌లో కూడా కొనుగోలుకు అవకాశం ఇవ్వడంతో ధాన్యాన్ని విక్రయించుకోగలిగారు. 3,4 తేదీల్లోనే జిల్లాలో రికార్డు స్థాయిలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించారు. అందులో అత్యధిక భాగం రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల ధాన్యమే.

సకాలంలో సాగునీరు విడుదల..

ఈ నెల 3న ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1000, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. ముందస్తు ప్రణాళికతో సాగునీరును సకాలంలో అందజేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుంది.

బొండాలు రకంపై ఆసక్తి

రైతు రబీలో ఎంటీయూ 2636 బొండాలు రకం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వాస్తవానికి ఈ రకం ధాన్యం కొనుగోలు సమస్యలతో కూడుకున్నది. ప్రభుత్వాలు తరచూ ఈ రకాన్ని సాగు చేయవద్దని, కాదని సాగు చేస్తే ప్రభుత్వం ద్వారా కొనుగోలుకు భరోసా ఇవ్వలేమని చెబుతోంది. ప్రైవేటు మిల్లులు వ్యాపార అవకాశాలు సానుకూలంగా ఉన్నప్పుడు బొండాలు రకాన్ని కొనుగోలు చేస్తారు. అది సాధ్యం కానపుడు ప్రైవేటు కొనుగోలు సైతం కష్టమవుతుంది.

శాస్త్రీయత పాటించాలి



రబీ సాగులో నారుమడిని శాస్త్రీయ పద్ధతిలో సాగు చేసుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత రెండు రోజుల పాటు నీరు లేకుండా జాగ్రత్త పడాలి. నీరు ఎక్కువగా ఉంటే విత్తనం మొలక శాతం తగ్గిపోయే ప్రమాదం ఉంది. 7 నుంచి నెల రోజుల మధ్యలో ఐదు రోజుల పాటు మడిలో నీరు లేకుండా చూడాలి. నీటిలో ఉంటే నారుమడి దెబ్బతింటుంది. ఐదు సెంట్ల నారుమడికి యూరియా, పొటాషియం ఎరువులను ఒక కేజీ చొప్పున చల్లాలి. అధిక వర్షాలకు నారు దెబ్బతినకుండా మడిలో నీటిని బయటకు పంపించి లీటరు నీటిలో 1 గ్రాము కార్బండైజం లేదా 2 గ్రాముల మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. వరినాట్లు పిలక దశలో ముంపునకు గురైతే నీటిని బయటకు పంపి ఎకరానికి యూరియా, పొటాష్‌లను 20 కేజీలు చొప్పున మడికి అందించాలి. ఇది బూస్టర్ డోసుగా ఉపకరిస్తుంది.

– కేవీఎస్ రమేష్‌కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం

ప్రధాన రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన మంత్రి వేణు



రామచంద్రపురం-ద్రాక్షారామ ప్రధాన రహదారి నిర్మాణ పనులను తాళ్లపొలం వద్ద పరిశీలిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నుంచి వేగాయమ్మపేటకు వరకు ద్రాక్షారామ మీదుగా నిర్మిస్తున్న ప్రధాన రహదారి పనులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం పరిశీలించారు. సీఆర్‌ఎఫ్ నిధులు రూ.25 కోట్లతో మండపేట మండలం ద్వారపూడి నుంచి వేగాయమ్మపేట వరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 2.1 కి.మీ. బీటీ రోడ్డు, 2.5 కి.మీ. సీసీ రోడ్లతో ప్రధాన రహదారి నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని ఆర్‌అండ్‌బీ జేఈ పి.ఫణిని మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ ఉన్నారు.

ఐక్యతకు ప్రతీకగా వన సమారాధనలు



అంగరలో శెట్టిబలిజ సంఘం కార్తిక సమారాధనలో ఎమ్మెల్సీ తోటకు సన్మానం

కపిలేశ్వరపురం: గ్రామాల్లో నిర్వహించుకునే కార్తిక వన సమారాధనలు ప్రజా సమూహాల మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంగరలోని దుర్గాదేవి ఆలయం వద్ద సోమవారం కపిలేశ్వరపురం మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట, టీడీపీ నాయకులు వి.సాయికుమార్‌బాబు, మండలంలోని శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 19 గ్రామాల్లోని 36 శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల శెట్టి బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి వాసు, వసుం పార్థసారథి, ఉపాధ్యక్షుడు చిట్టూరు నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సామాజికవర్గ ఐక్యతను చాటి చెప్పారు. అతిథులను ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

రామచంద్రపురం: అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మంగళవారం నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. ఏడో వేతన సవరణ కమిటీలో అమలు కాని అంశాలపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని ఉద్యోగుల సంఘ రామచంద్రపురం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మునేశ్వరరావు, స్వర్ణన్‌రాజు సోమవారం ఇక్కడ మండిపడ్డారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఎనిమిది గంటల పని, పింఛను సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యం, పదోన్నతులు, గ్రాడ్యుటీ వంటి సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్లతో కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్టు తెలిపారు.

సంప్రదాయ క్రీడల ప్రోత్సాహమే లక్ష్యం

మంత్రి చెల్లుబోయిన వేణు



షటిల్ ఆడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందించిన క్రీడా సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సంస్కరణల దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు, యువతకు క్రీడలు దోహదపడతాయన్న ఉద్దేశంతో, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా సామగ్రిని కూడా ఉచితంగా అందించిందన్నారు. ఈ నెల 15 నుంచి 23 వరకు గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. గ్రామాల్లోని యువత ఇందులో విజయం సాధించి, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం కొంతసేపు ప్రజాప్రతినిధులతో షటిల్ ఆడారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు నీతిపూడి మధుబాల, దూడల నాగేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, ఎంఈఓ నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మనసున్న మారాజు సీఎం జగన్



సుందరపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని, మనసున్న మారాజు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా సుందరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. తొలుత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రచార బోర్డును ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, సర్పంచ్ సలాది లక్ష్మీశిరీషతో కలసి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, సర్పంచ్‌లు తోగల మంగ, కోటిపల్లి సుబ్బారావు, కుందూరు సర్పంచ్ సత్యానందం, సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, కన్వీనర్లు రెడ్డి జయరాజు, మేడిశెట్టి దుర్గారావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సోమేశ్వరంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ పేర్కొన్నారు. మండలంలోని సోమేశ్వరంలో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, మంగతాయారు, వెంకటరమణ, ఆరిఫ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రూ.3 నుంచి రూ.7లక్షలు ఈ నాలుగున్నరేళ్లలో పంపిణీ చేశారన్నారు. రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందినవారేనన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణ రెడ్డి, పార్టీ నేతలు గరగ కామరాజు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేద్దాం



రాయవరంలో క్రీడా పరికరాలు అందజేస్తున్న శ్రీనివాసరావు, వెంకటరమణలు

రాయవరం: ఆడుదాం..ఆంధ్ర పోటీలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో సోమవారం సచివాలయ స్థాయిలో ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్లుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, ఎంఈవోలతో ఎంపీపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్ క్రీడలకు 4,332 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 60 శాతం క్రీడాకారులు నమోదయ్యాయన్నారు. అనంతరం మండలంలోని 19 సచివాలయాలకు క్రీడా కిట్లు ఏఎంసీ చైర్మన్, ఎంపీపీల చేతుల మీదుగా అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పాల్గొన్నారు.

సర్వం శివనామ స్మరణం

- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- కార్తికంలోని ఆఖరి సోమవారం కావడంతో విశేష పూజలు



సోమేశ్వరంలో స్వామివారికి పూజాదికాలు నిర్వహిస్తున్న అర్చకుడు



రాయవరంలో నయనానందకరంగా అలంకృతులైన పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారు

రాయవరం: కార్తిక మాసంలోని ఆఖరి సోమవారం కావడంతో ఎక్కడ చూసినా శివ నామస్మరణే కనిపించింది. వేకువ జాము నుంచే శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. హరహర మహాదేవ శంభో శంకర..ఓం నమఃశివాయ, గౌరీపతే..నమోస్తుతే అనే నినాదాలు మిన్నంటాయి. మండలంలో చారిత్రక సోమేశ్వరం బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలతో పాటు రాయవరం రాజరాజేశ్వరస్వామి, చెల్లూరు బాలాత్రిపుర సుందరీ సమేత అగస్తేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివలింగాలకు పాలు, పెరుగు, తేనె, పంచదార, పండ్ల రసాలు, పసుపు, కుంకుమ, చందనం, విభూది తదితర ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజామున భక్తులతో ప్రారంభమైన క్యూలైన్లు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగాయి. ఉదయం నుంచి ఉపవాస దీక్ష పాటించిన మహిళలు సాయంత్రం పురోహితులకు స్వయంపాకం అందజేసిన అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. స్వయంపాకంతో పాటు పలువురు మహిళా భక్తులు దీపాలను దానం చేశారు. భక్తులు కార్తిక దీపాలను వెలిగించడంతో ఆలయాలు దీప శోభను సంతరించుకున్నాయి.

పీఠంలో షణ్ముఖ శర్మ పూజలు

సందర్శించిన టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు



గాడ్ ఆశీస్సులు పొందుతున్న సామవేదం షణ్ముఖ శర్మ, టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠాన్ని ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ, టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు సందర్శించారు. పీఠంలో విజయదుర్గ అమ్మవారి సన్నిధిలో వారిరువురు పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం వారు విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్)ను దర్శించుకుని, ఆశీర్వచనాలు పొందారు. టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు శ్రీవారి ప్రసాదాన్ని పీఠాధిపతి గాడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సామవేదం షణ్ముఖ శర్మ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. దుర్గమ్మను పూజిస్తే దుఃఖ, దురిత, దురాచార తదితర గుణాలను పోగొడుతుందన్నారు. ఆపదలో ఆదుకునే శక్తి దుర్గమ్మకు ఉంటుందన్నారు. భారత దేశంలో సనాతన ధర్మం పరిరక్షించబడాలన్నారు. అనంతరం వేణుగోపాల దీక్షితులు పీఠంలో అమ్మవారి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. గాడ్ సమక్షంలో సామవేదం షణ్ముఖశర్మ, వేణుగోపాల దీక్షితులను పీఠం ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్య వెంకటకామేశ్వరి దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్, విజయదుర్గా సేవా ప్రతినిధులు బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో ఎమ్మెల్సీ తోట పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: సోమేశ్వరం గ్రామంలో కొలువైన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారిని సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. కార్తిక మాసంలోని చివరి సోమవారాన్ని పురస్కరించుకుని త్రిమూర్తులు ఈ ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారణలో ఉన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు భక్తిశ్రద్ధలతో పూజాదికాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలన్నారు. చారిత్రక శివాలయమైన సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామిని దర్శించుకుని, పూజలు చేయడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ఎమ్మెల్సీ వెంట సర్పంచ్ ఆరిఫ్, మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి విశేష పూజలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ తోట సందర్శించారు. మాలధారణలో స్వామికి విశేష పూజలు చేశారు. కోరుమిల్లి గ్రామం ఆధ్యాత్మికతకు నిలయమని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సలాది వీరబాబు, సలాది అప్పారావు, పెద్దిరెడ్డి దొరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, ఆచంట వీరాస్వామి ఉన్నారు.

నేడు కార్తిక దీపారాధన మహోత్సవం

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాట్లు



ప్రసన్నాంజనేయస్వామి



స్వామివారి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి కార్తిక దీపారాధన మహోత్సవాలు మంగళవారం జరగనున్నాయి. కార్తిక మాసంలో ఆఖరి మంగళవారం రోజున కార్తిక దీపారాధన మహోత్సవాల్లో భాగంగా జుత్తుక చిన్న సారథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దంపతులు పూజలు నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు విశేష లక్ష తులసీ పూజ, మధ్యాహ్నం 1 గంటకు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తో ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం, మధ్యాహ్నం 2 నుంచి డిజిటల్ భక్తి గీతాల ఆడియో, సాయంత్రం 4 నుంచి భజన కాలక్షేపం జరుగుతాయి. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులతో సాయంత్రం 5.17కు అఖండ జ్యోతి ప్రజ్వలన, అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ భక్తి గీతాల సంగీత లహరి, రాత్రి 10 నుంచి బాణసంచా సందడి ఉంటుంది. అర్ధరాత్రి 12 గంటలకు రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన జరుగుతాయి.

ఉత్సవాల చరిత్ర ఇదే..

ప్రస్తుతం భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ స్థానంలోనే ఏలూరి సత్యం అనే దాత నిర్మించిన ఆంజనేయస్వామి వారి ఆలయం ఉండేది. ఆయన తమ్ముడి కుమారుడు ఏలూరి ప్రసాదరావు సొంత ఖర్చులతో కొందరితో కలిసి 1960 నుంచి ప్రతి మంగళవారం భజన కార్యక్రమాలు చేసేవారు. అప్పటికే అన్నాయిపేటలో కార్తిక దీపారాధన స్ఫూర్తితో ఇక్కడ కూడా అలా చేయాలని ప్రసాదరావుకు తలంపు వచ్చింది. 1963లో పైండా అన్నసత్రం దాత, జమీందార్ పైండా రామకృష్ణయ్యను కలసి, తమకు విద్యుత్తు, కళాకారులకు భోజనం, వసతి కల్పించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో అప్పటి నుంచి కార్తిక దీపారాధన ఉత్సవాలు మొదలయ్యాయి. అప్పట్లో ఆంజనేయ బాల భక్త సమాజం పేరిట కార్యక్రమాలు నిర్వహించేవారు. బాలభక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏలూరి ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు దీపారాధన కార్యక్రమాలు నిర్వహించేవారు.